సాక్షి
కామారెడ్డి
బుధవారం ၊ 23 ၊ జూలై ၊ 2025



**ఇంటిగ్రేటెడ్‌కు మోక్షమెప్పుడో..**
బాన్సువాడలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.
- 9లో ▸



**ఆపరేటర్ల విధుల బహిష్కరణ**
తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విధులను బహిష్కరించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.6 /22.5
**వాతావరణం**
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### నిండుగా ప్రవహిస్తున్న నల్లవాగు



నిజాంసాగర్(జుక్కల్): సంగారెడ్డి జిల్లా కంగ్టి, కల్హేర్ మండలాల్లో వర్షం కురవడంతో మండలంలోని నల్లవాగు మత్తడిలోకి మంగళవారం వరద నీటి ప్రవాహం ప్రారంభమైంది. నిన్నటి వరకు చుక్కనీరు లేక బండరాళ్లతో దర్శనమిచ్చిన నల్లవాగు వరద ప్రవాహంతో కళకళలాడుతోంది. నల్లవాగులోకి వరద రావడంతో వెల్గనూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్, మాగి, గోర్గల్, ఒడ్డేపల్లి గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### జాతీయస్థాయి కబడ్డీకి ఎంపిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి దేమి నవీన్ కబడ్డీ సీనియర్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైనట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లోని నవీన్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. బుధవారం నుంచి సోమవారం వరకు చండీగఢ్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. తనను ప్రోత్సహించడంతోపాటు సహకరించిన నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్, మాజీ అధ్యక్షుడు జగదీశ్, వీడీసీ చైర్మన్ మేకల రాజు, మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్యామ్ రావుతోపాటు సీనియర్ క్రీడాకారులకు నవీన్ కృతజ్ఞతలు తెలిపాడు.

### 150 సెల్‌ఫోన్‌ల రికవరీ

- ఎస్పీ రాజేశ్‌చంద్ర



కామారెడ్డి క్రైం: జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వారం రోజుల్లో 150 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.25లక్షల వరకు ఉంటుందని ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళనకు గురి కావొద్దని, సీఈఐఆర్ విధానంలో రికవరీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3,551 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు భద్రతా కారణాల దృష్ట్యా వెంటనే అందులోని సిమ్ కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. ఆలస్యం చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన బృందం సభ్యులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన ఫోన్‌లను బాధితులకు అందజేస్తామని, ఆర్ఎస్సై బాల్‌రాజు (87126 86114)ను సంప్రదించి ఫోన్‌లు తీసుకువెళ్లాలని సూచించారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### 25న లింగంపేటలో బీఆర్ఎస్ సభ!

- ఏర్పాట్లపై సమీక్షించిన మాజీ మంత్రి వేముల



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'ఆత్మగౌరవ మహాగర్జన' పేరుతో ఈ నెల 25న లింగంపేట మండల కేంద్రంలో నిర్వహించతలపెట్టిన సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఆయనతోపాటు పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. సభకు సంబంధించిన ఏర్పాట్లపై మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్‌తో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమీక్షించారు. లింగంపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మహాగర్జన సభ ఉంటుందని వారు తెలిపారు.

# ఎడ్యుకేషన్ హబ్ ఎన్నికల హామీయేనా?

- విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉన్నత చదువు
- పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కోసం పట్నం వెళ్లాల్సిందే..
- డైట్, బీఎడ్, నర్సింగ్, ఫార్మసీ కాలేజీలు ఒక్కటీ లేదు
- పీజీ కోర్సులకు నోచుకోని డెయిరీ కళాశాల
- జిల్లా కేంద్రమైన కామారెడ్డి నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నాలుగు దశాబ్దాల కిందటే రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రత్యేక కోర్సులతో కామారెడ్డిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటైంది. ఇక్కడ చదువుకున్న వాళ్లు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అప్పట్లోనే ఉన్నత చదువుల గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు ఆలోచనలు చేశారు. తరువాతి కాలంలో ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యారంగ అభివృద్ధి కోసం పెద్దగా ప్రయత్నాలు చేసింది లేదు! గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది తప్ప మరే ఇతర కాలేజీలు ఏర్పాటు కాలేదు. దీంతో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ నగరానికి లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో విద్యాసంస్థల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలున్నా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఇస్తున్న హామీలు ఆచరణ రూపం దాల్చడం లేదు. కామారెడ్డి పట్టణంలో డిగ్రీ కాలేజీ స్థలం, జంగంపల్లి వద్ద తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోనూ స్థలాలున్నాయి. అలాగే జంగంపల్లి, క్యాసంపల్లి, ఇల్చిపూర్, అడ్లూర్ తదితర గ్రామాల పరిధిలో జాతీయ రహదారి వెంట వందలాది ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. విద్యాసంస్థల ఏర్పాటు విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రయత్నం చేయడంలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మరిన్ని కోర్సులు తీసుకువచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అనేక అవకాశాలున్నాయి. ఎంతో చరిత్ర ఉన్న డిగ్రీ కాలేజీపై పాలకులు దృష్టి సారించాలి.

### బీఎడ్, డీఎడ్ కూడా..

జిల్లా కేంద్రంలో ప్రైవేట్ రంగంలో బీఎడ్, డీఎడ్ కాలేజీలు ఉన్నాయి. అప్పట్లో జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఎడ్ కాలేజీలో వంద సీట్లు ఉండేవి. ఎంతో మంది చదువుకున్నారు. తరువాత సీట్లలో కోత విధించారు. దీంతో బీఎడ్ చదువుకునేందుకు ఆసక్తి ఉన్నా సీట్లు దొరకని పరిస్థితి. డీఎడ్ చదువుకోవాలంటే ప్రభుత్వ డైట్ కాలేజీలు ఉంటే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉండేది. ప్రైవేట్‌లో చదవడం అందరికీ భారమే. జిల్లా ఏర్పాటై తొమ్మిదేళ్లవుతున్నా డైట్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న అంశాన్ని ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

### సాంకేతిక విద్య లేదిక్కడ

కామారెడ్డి నియోజకవర్గంలోనే కాదు జిల్లాలో ఎక్కడా పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీలు లేవు. గతంలో కామారెడ్డిలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీని కొన్ని రోజులు నడిపించి హైదరాబాద్‌కు తరలించుకుపోయారు. అప్పటి నుంచి ఇంజినీరింగ్ చదువుకోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. అందుబాటులో ఇంజినీరింగ్ కాలేజీలు ఉంటే స్థానికులు ర్యాంకుల ఆధారంగా సీట్లు పొంది ఏ ఇబ్బందీ లేకుండా చదువుకునేవారు. హైదరాబాద్‌కు వెళ్లి చదువుకోవాలంటే అక్కడ హాస్టళ్లకు అయ్యే వ్యయం, ఇతర ఖర్చులు పేద, మధ్య తరగతికి భారంగా మారాయి. కొన్ని జిల్లాల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారు. కామారెడ్డి మీద ఎందుకు చిన్నచూపో తెలియదు కానీ ఒక్కటీ రాలేదు. అలాగే స్థానికంగా పాలిటెక్నిక్ కానీ, ఐటీఐ కానీ లేవు. ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు కొత్తవి ఏర్పాటు చేస్తోంది. కామారెడ్డికి మాత్రం ఇప్పటికీ మంజూరు కాలేదు. నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఏటీసీ కోసం ఎవరూ ప్రయత్నించడం లేదు.



మెడికల్ కాలేజీకి అనుబంధంగా..

జిల్లా కేంద్రంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని చోట్ల మెడికల్ కాలేజీల్లోనే నర్సింగ్‌కు అవకాశం ఇచ్చారు. అయితే కామారెడ్డిలో నర్సింగ్ కాలేజీకి సంబంధించి ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. మెడికల్ కాలేజీ ఉన్నపుడు వైద్య రంగానికి అవసరమైన ఇతర కోర్సులన్నింటినీ ప్రారంభిస్తే సరిపడా నిపుణులు, ఉద్యోగులు ఇక్కడే తయారవుతారు. అదీ ఎవరికీ పట్టడం లేదు. వైద్యానికి సంబంధించి అనేక కోర్సులు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ ప్రయత్నాలు జరగడం లేదని తెలుస్తోంది.

### సౌత్ క్యాంపస్‌నూ పట్టించుకోరు

తెలంగాణ యూనివర్సిటీలో భాగమైన సౌత్ క్యాంపస్ భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉంది. ఇక్కడ పలు పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. సౌత్ క్యాంపస్ 44వ నంబరు జాతీయ రహదారిపై ఉంది. ఇక్కడ వివిధ కాలేజీలు, కోర్సులు ప్రారంభించడానికి అవసరమైన భూములు, భవనాలు ఉన్నాయి.

హాస్టళ్లు కూడా ఉన్నాయి. సౌత్ క్యాంపస్‌లో ఉపాధినిచ్చే వివిధ కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసర ం ఉంది. ఇక్కడ లా కోర్సులు కూడా ఏర్పాటు చేస్తే ఎంతో మందికి చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇప్పటికైనా నియోజక వర్గానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు విద్యారంగ అభివృద్ధి కోసం తమ వంతు ప్రయత్నాలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

### డెయిరీ పీజీ కోర్సులేవీ..

రాష్ట్రంలోనే ఏకైక డెయిరీ కాలేజీ కామారెడ్డిలో ఉంది. మొదట్లో బీఎస్సీ డెయిరీ కోర్సుగా ఉండేది. తరువాత బీటెక్ డెయిరీగా మారింది. పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఆధీనంలో కొనసాగుతోంది. ప్రభుత్వ పెద్దలు అనుకుంటే కామారెడ్డిలో ఉన్న డెయిరీ కాలేజీ కేంద్రంగా డెయిరీ యూనివర్సిటీని ఏర్పాటు చేయొచ్చు. ఇప్పుడే కాదు భవిష్యత్‌లోనూ పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి అనేక పరిశోధనలు జరగాల్సి ఉంటుంది. అలాంటి డెయిరీ కోర్సులను నిర్లక్ష్యం చేస్తున్నారు. పీజీ కోర్సులు నిర్వహించడానికి కావాల్సిన భవనాలు, స్థలం కూడా ఉంది. ఇక్కడ 60 ఎకరాల భూమి ఉంది. యూనివర్సిటీ కాదూ కూడదంటే కనీసం పీజీ కోర్సులైనా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది.



### తులం బంగారం రూ.లక్ష!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తులం బంగారం ధర రూ.లక్ష మార్కును తాకింది. మంగళవారం మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.లక్షకు అమ్మారు. గత కొంత కాలంగా రూ.96 వేల నుంచి రూ.98 వేల మధ్య కొనసాగిన ధర ఇప్పుడు ఏకంగా రూ.లక్షకు చేరుకుంది. ఓ వైపు శ్రావణ మాసంలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనుండగా, మరో వైపు బంగారం ధరలు పెరుగుతుండడం కొనుగోలుదారులను ఆందోళన కలిగిస్తోంది.

### డాక్టర్ అపాయింట్‌మెంట్ పేరుతో సైబర్ మోసం

లింగంపేట(ఎల్లారెడ్డి): డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించిన ఓ వ్యక్తిని సైబర్ మోసగాడు నమ్మించి బ్యాంకు ఖాతా నుంచి రూ.51వేలు కాజేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ వైద్యుడు పత్తి భాస్కర్ హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి చెందిన వైద్యుడి అపాయింట్‌మెంట్ కోసం ఆన్‌లైన్లో సెర్చ్ చేశాడు. దీన్ని పసిగట్టిన సైబర్ మోసగాడు భాస్కర్‌కు ఫోన్ చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్ బుక్ చేసే విధానమని చెబుతూ నమ్మించారు. సైబర్ మోసగాడు చెప్పిన విధంగా భాస్కర్ వివరాలు నమోదు చేయగా, కొద్ది సేపటికి అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.35వేలు ఒకసారి, రూ.16వేలు మరోసారి మొత్తం రూ.51వేలు డ్రా అయ్యాయి. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు 1930 సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన గౌతమ్ సైబర్ నేరానికి పాల్పడ్డాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు.

### పచ్చదనాన్ని పెంపొందించాలి



మొక్కనాటి నీరుపోస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం : భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఎస్పీ మంగళవారం మొక్కలు నాటారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్, విఠల్‌రెడ్డి, ఎస్బీ సీఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలపై అవగాహన ఉండాలి

మాచారెడ్డి : రైతులు వ్యవసాయ పరికరాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని గజ్యానాయక్ తండా రైతువేదికలో మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా రైతులు అవగాహన కలిగి సేద్యం చేయాలన్నారు. అనంతరం కొత్తపల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి చీడపీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాచారెడ్డి, పాల్వంచ ఏవోలు పవన్‌కుమార్, శ్రీనివాస్‌రావ్, ఏఈవోలు ప్రభాకర్, తేజ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**ఎరువుల దుకాణం తనిఖీ**

మాచారెడ్డి చౌరస్తాలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా మెయింటెయిన్ చేయాలని, స్టాక్‌వివరాలను పేర్కొనాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాచారెడ్డి చౌరస్తాలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

## సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, రెవెన్యూ సదస్సులు, భూ సమస్యల పరిష్కారాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రభుత్వ ప్రధాన్య కార్యక్రమాలకు సంబంధించి పలు సూచనలు చేశారు.

వీసీ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలని, ఆహార భద్రత, పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు పాముకాటు ప్రమాదాలకు గురికాకుండా హాస్టళ్లు, గురుకులాల ప్రాంగణాల్లో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, డీఎఫ్‌వో నిఖిత, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు

## యూరియా పక్కదారిపై నిఘా

- మండలానికో టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏర్పాటు
- వివరాలు సేకరించనున్న వ్యవసాయ శాఖ



కామారెడ్డి క్రైం: యూరియా పక్కదారి పట్టకుండా వ్యవసాయశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం మండలానికో ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. యూరియా పక్కదారి పడుతున్నట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగించడంపై దృష్టి పెట్టాలని సూచించిన విషయం తెలిసిందే. దీంతో కామారెడ్డి జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో స్థానిక తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, ఎస్సైలు సభ్యులుగా ఉంటారు. యూరియా పక్కదారి పట్టే అవకాశాలు ఉండే అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలను తనిఖీ చేస్తారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వాడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ప్లైవుడ్, పెయింట్స్, ఆక్వా ఆహార పదార్థాల తయారీ, డీజిల్ ఉత్పత్తులు, పేలుడు పదార్థాల తయారీ, గుగ్గిలం వంటి ఇతర వస్తువులు, కల్తీ కల్లు, ఇతర ద్రవాల తయారీకి ఉపయోగిస్తుంటారు. సంబంధిత పరిశ్రమల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టే అవకాశాలున్నాయి.

## అసంపూర్తి ఇళ్లకూ ఇందిరమ్మ నిధులు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: వైఎస్ఆర్ హయాంలో ఇళ్లు మంజూరై బేస్‌మెంట్ వరకు బిల్లులు వచ్చిన వారికి తాజాగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్ని మండల కేంద్రంలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 1,699 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా 6 లక్షల 12 వేల మందికి కొత్తగా కార్డులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డు అవసరం పడుతుందని, పేదలకు రేషన్ కార్డులు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనర్హులు, ధనవంతులు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉంటే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలని, అనర్హులు పేదల నోటికాడి బుక్కను లాక్కునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉంటే వారికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏఎంసీ చైర్మన్ సురేశ్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ గోపాల్, పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు హరిదాసు, గంగారాం, అంబర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ రుద్రూర్ మండల అధ్యక్షుడు తోట అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

### వేతనంలో రూ.వెయ్యి తగ్గించొద్దు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని బల్దియా ఎదుట సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమల్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా కామారెడ్డి మున్సిపల్‌లో కార్మికుల వేతనాల నుంచి రూ.1000 తగ్గిస్తూ బిల్లులు చేయడం దారుణమన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. అనంతరం కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నేతలు పాలడుగు సుధాకర్, చంద్రశేఖర్, రాజనర్సు, మహబూబ్, కార్మికులు పాల్గొన్నారు.




ధర్నా చేపడుతున్న కార్మికులు

## ఉల్లంఘన ఒకటి.. జరిమానాలు రెండు



నస్రుల్లాబాద్ : మోటార్ వెహికిల్ నిబంధన ఉల్లంఘించాడనే కారణంతో ఓ వాహనదారుడికి జరిమానా విధించిన పోలీసులు.. అదే ఫొటోను ఆన్‌లైన్‌లో మళ్లీ అప్‌లోడ్ చేసి మరోసారి జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 10వ తేదీన నస్రుల్లాబాద్ మండలానికి చెందిన ఓ వ్యక్తి కామారెడ్డికి బైక్(ఏపీ 25 ఏఎస్ 5736)పై వెళ్లాడు. హెల్మెట్ ధరించకుండా బైక్ నడుపుతున్నాడనే కారణంతో సదాశివనగర్ పోలీసులు స్టేషన్ ముందు ఫొటో తీసిన పోలీసులు అదే రోజు రూ.235 జరిమానా విధించారు. అయితే అదే ఫొటోను 14వ తేదీన మళ్లీ అప్‌లోడ్ చేసి పద్మాజీ వాడ క్రాస్‌రోడ్డు వద్ద హెల్మెట్ లేకుండా ప్రయాణించాడని రూ.235 జరిమానా వేధించారు. 10వ తేదీన పోలీసులు తీసిన ఫొటోపై వాటర్‌మార్క్‌లో తేదీ స్పష్టంగా కనిపిస్తుండగా అదే ఫొటోను 14వ తేదీన అప్‌లోడ్ చేసి జరిమానా విధించడం గమనార్హం.





ఆన్‌లైన్‌లో చలాన్

## క్లుప్తంగా

### వృద్ధాశ్రమంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కామారెడ్డి అర్బన్:** కామారెడ్డిలోని పాత ఎస్పీఆర్ పాఠశాల సమీపంలోని లైట్ ఫర్ ద్ బ్లైండ్ అనే స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంలో నిర్వహించే వృద్ధాశ్రమంలో వివిధ ఉద్యోగాల్లో పనిచేయడానికి ఆసక్తి, అర్హత గల జిల్లా అభ్యర్థుల నుంచి ఈ నెల 29 వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఏ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. హోం కో–ఆర్డినేటర్, విజిట్ డాక్టర్, అసిస్టెంట్ హోం కో–ఆర్డినేటర్, పార్ట్‌టైం నర్స్, ఫుల్ టైం ఏఎన్ఎం, అకౌంటెంట్ కమ్ క్లర్క్(వారానికి 8 గంటల పని), యోగాథెరపిస్ట్(ప్రతిరోజూ గంట), వంట మనిషి, 3 మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగాలున్నాయని ఆమె వెల్లడించారు. జీతం, విద్యార్హత తదితర వివరాలకు తమ కార్యాలయంలో లేదా 9440026076 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

### అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి..

**కామారెడ్డి అర్బన్:** పేద ఎస్సీ విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సహాయం పొందడానికి ఆగస్టు 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్సీ కులాల జిల్లా అభివృద్ధి అధికారి పి.వెంకటేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ అర్హత స్కోర్ పొంది ఉండాలన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

### నాణ్యమైన పోస్టల్ సేవలు అందిస్తాం



**నిజామాబాద్ లీగల్:** పోస్టల్ డిపార్ట్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామని, దీనిద్వారా నాణ్యమైన సేవలను అందిస్తామని పోస్టల్ ఎస్ఎస్పీవో ఎస్ జనార్దన్‌రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోస్టాఫీస్‌లో మంగళవారం ఆయన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన సాఫ్ట్‌వేర్‌పై సిబ్బందికి గత నెల 15 రోజులుగా శిక్షణ ఇచ్చామని, నూతన సాఫ్ట్‌వేర్, శిక్షణ కార్యక్రమాలనతో తమ సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని అన్నారు. ఏఎస్పీ సురేఖ, ఐపీపీజీ శ్రావణ్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ అజయ్ కుమార్, పోస్టుమాస్టర్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

# వర్షాకాలం మూగజీవాలు పైలం

- ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మేలంటున్న పశువైద్యాధికారులు
- పశువుల షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచన



సదాశివనగర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు (ఫైల్)

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** వర్షాకాలంలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు రోగాల బారిన పడి చనిపోతూ ఉంటాయి. దీంతో పశువుల యజమానులు తీవ్రంగా నష్టపోతారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని నివారించవచ్చు. పశువైద్యాధికారులు సైతం వ్యాధుల నివారణ జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**విషపూరిత మొక్కలతో నష్టం..**

పచ్చిక బయళ్లు, అడవులు, ఖాళీ మైదాన ప్రాంతాల్లో పెరిగే అత్తిపత్తి, బెల్లింత, చివుకు చెట్లు వారాల పూల చెట్లు విష పూరితమైనవి. వీటిని పశువులు ఆహారంగా తీసుకుంటే అనారోగ్యం పాలవుతాయి. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా పెరిగే పంచ రంగు పూల(లాంటానా) మొక్కలు తింటే పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఈ మొక్కలు ఎక్కువగా జూన్, జూలైలో గుబురుగా ఉండి జంతువులు మేసేందుకు ఆకర్షిస్తాయి. ఈ మొక్కల్లో ఉండే విష పదార్థం వల్ల జీవాల కాలేయం దెబ్బతిని కామెర్లు వస్తుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. వీటి ద్వారా పసర వ్యాధి కూడా సోకుతుంది. బీడు భూములు, ఖాళీ ప్రదేశాల్లో ఉండే విషపూరిత మొక్కలను తొలగించడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు. లేత గడ్డి మేయడం వల్ల గొర్లలో చిలుకు రోగం వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

**కలుషిత నీరును తాగించొద్దు..**

జీవాలకు అపరిశుభ్రమైన నీటిని తాగించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. కలుషిత నీటిని తాగడం వల్ల నట్టలు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. పశువుల షెడ్లలో దోమల బెడద లేకుండా ఉండడానికి ఫ్యాన్‌లను ఏర్పాటు చేసుకోవాలి. షెడ్లలో సాయంత్రం వేళలో వేపాకుతో పొగ పెట్టాలి. దీంతో కొంత మేరకు దోమల బెడదను నివారించవచ్చు. షెడ్లలో రెగ్యులర్‌గా బ్లీచింగ్ పౌడర్ చల్లుతుండాలి. గొర్లలో పారుడు రోగం, మూతి వాపు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. గేదెలలో గొంతు వాపు, గాలికుంటు, జబ్బవాపు వచ్చే ప్రమాదం ఉంది.

### వైద్యుల సూచనలు పాటించాలి



వర్షా కాలం రైతులు పశువుల పెంపకం పట్ల అప్రమత్తంగా ఉండాలి. వైద్యాధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు తప్పని సరి పాటించాలి. నివారణకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. పసర విష ప్రభావం నివారణకు జీవాలను 2 నుంచి 3 రోజుల పాటు నీడలో ఉంచాలి. సూర్యరశ్మి తగలనీయొద్దు. పశువైద్యులు ఇచ్చే మందులు వాడాలి. ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలి. చెరువులు, నీటి పారుదల వెంట ఉండే గడ్డిని మేపొద్దు. బురదలో పశువులు నడవడం వల్ల కాళ్లల్లో పుండ్లు వచ్చే అవకాశం ఉంటుంది. పశువులు ఉన్న ప్రాంతంలో ఈగలు, దోమలు లేకుండా చూసుకోవాలి.

– రాంప్రసాద్, మండల పశువైద్యాధికారి, సదాశివనగర్

# ‘ఆపరేటర్ల’ విధుల బహిష్కరణ



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈ- పంచాయతీ ఆపరేటర్లు

**కామారెడ్డి క్రైం:** ఎంతో కాలంగా నెలకొన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ–పంచాయతీ ఆపరేటర్లు విధులు బహిష్కరించారు. ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లాలో 50 మందికి పైగా ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌లుగా 2015 నుంచి పని చేస్తున్నామని తెలిపారు. 3 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అంతే కాకుండా ప్రతి నెలా జీతాలు తగ్గించి రూ.22,750 కి బదులుగా రూ.19,500 లు ఇస్తున్నారని వెల్లడించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఎలాంటి ఉద్యోగ భద్రత, సౌకర్యాలు గానీ లేవన్నారు. జిల్లా అధికారుల ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తున్నామని, ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్‌లను పరిష్కరించే వరకు విధులు బహిష్కరిస్తున్నామని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు..**

- ఈ–పంచాయతీ ఆపరేటర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- 10 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలి.
- మార్చి నుంచి జూన్ వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి.
- ఉద్యోగులకు మాదిరిగానే ఇతర అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

## ఆధ్యాత్మికం

### ఉత్సాహంగా తీజ్ ఉత్సవం



**నస్రుల్లాబాద్:** సంగం గ్రామంలో మంగళవారం తీజ్ ఉత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా ఎంతో నియమ నిష్ఠలతో ఏర్పాటు చేసిన నవ ధాన్యాల బుట్టలను ఆడపడుచులు ఊరేగించారు. బంధువులు ఇచ్చే కానుకలు, ఆశీర్వచనాలను స్వీకరిస్తూ సంప్రదాయ నృత్యాలు చేశారు. తీజ్ నోముల కుండీలను సాయంత్రం చెరువులో నిమజ్జనం చేశారు.

### వర్షాల కోసం నిండు బిందెలతో ఊరేగింపు



**మద్నూర్(జుక్కల్):** వానాకాలం ప్రారంభమైనా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీవాసులు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో అభిషేకం నిర్వహించి మొక్కుకున్నారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నల ఇంట్లో సిరి సంపదలు కురవాలని వారు వేడుకున్నారు.

### కొత్తాబాదిలో సీత్లా పండుగ



**బాన్సువాడ రూరల్:** కొత్తాబాదిలో బుధవారం సీత్లా పండుగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పంటలు, పశుసంపద, ఆరోగ్యం కోసం ఈ పండుగను జరుపుకుంటామని గిరిజన నాయకులు తెలిపారు. లంబాడీ గిరిజనులు జరుపుకునే తొలి పండుగ సీత్లా అన్నారు. ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని మొక్కుకున్నారు.

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- నెలవారీ సమీక్షలో అధికారులకు ఎస్పీ రాజేష్ చంద్ర సూచన



పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ

**కామారెడ్డి క్రైం:** రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలు, చేపడుతున్న విచారణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీసు అధికారులు ప్రతి రోజూ గ్రామాలను సందర్శించాలని సూచించారు. వీపీలు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులతో గ్రామాల్లో వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి సమాచారం వేగంగా అందేలా చూడాలన్నారు. గొడవలకు కారణమయ్యే వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం అందించాలన్నారు. పోలీసు అవగాహనా కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహిస్తూ ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పని చేయాలన్నారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు



**బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్‌కు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మరమ్మతులు చేయించారు. ప్రధాన రహదారి పాత అంగడి బజారు నుంచి బస్ డిపో వరకు, తాడ్కోల్ చౌరస్తా నుంచి తాడ్కోల్ వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేశారు. కొంత కాలంగా ప్రధాన రహదారిపై అక్కడక్కడ లైట్లు వెలగకపోవడంతో మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు.

### విద్యారంగ సమస్యలపై దశలవారీగా పోరాటాలు



**కామారెడ్డి టౌన్:** ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని ఆ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ సభ్యులు చకినాల అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాల ఆవరణలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీలలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించాలని, ఆగష్టు 1న జిల్లా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలని, 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా ఉంటుందని వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు చింతల లింగం, ఆకుల బాబు, దేవులా, శ్యాంకుమార్, నారాయణ, వంశీధర్, సంతోష్, విజయరామరాజు తదితరులున్నారు.

### మంత్రితో ఇందుప్రియ భేటీ



**కామారెడ్డి టౌన్:** బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట నాయకులు శ్రీనివాస్, వంశీకృష్ణ, సాయిబాబా, సలీం, రమేష్ తదితరులున్నారు.

### రేషన్ కార్డుల పంపిణీ

**నిజాంసాగర్(జుక్కల్):** అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలం గున్కుల్, తుంకిపల్లి గ్రామాల్లో రేషన్ కార్డులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్, తోట రాజు, కుమ్మరి రాములు, మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్ తదితరులున్నారు.



గున్కుల్‌లో రేషన్‌కార్డులను అందజేస్తున్న కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి

**పాల్వంపేటలో..**

**లింగంపేట(ఎల్లారెడ్డి):** పాల్వంపేటలో మంగళవారం రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి అశ్వక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలాలి అజయ్‌గౌడ్, నాయకులు శివకుమార్, కృష్ణమూర్తి, ఆగమయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

**చందాపూర్‌లో..**

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** చందాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన వారందరికి రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు.



పాల్వంపేటలో .. కాంగ్రెస్ నేత నాగరాజు



తాడ్వాయి మండలం చందాపూర్‌లో..



## క్రైం కార్నర్

### తాళం వేసిన ఇంట్లో చోరీ



**వర్ని:** మండలంలోని జాకోర గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు వర్ని ఎస్సై మహేష్ తెలిపారు. గ్రామానికి చెందిన తేజస్విని మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లింది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి రాగా, ఇంటి తాళంతోపాటు బీరువా తాళాలు పగలగొట్టి ఉండటం చూసి, చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనస్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.15వేల నగదు, రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

**ఇందల్వాయి:** ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి శివారులో అటవీ భూమిని చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసి ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రవి మోహన్ భట్ తెలిపారు. ట్రాక్టర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన డిప్యూటీ రేంజ్ అధికారి తుకారం రాథోడ్, సెక్షన్ అధికారి అబ్దుల్ అతిఖ్, బీట్ అధికారులు నవీన్, ఖదీర్‌లను ఎఫ్ఆర్‌వో అభినందించారు.

# చిన్నారి కిడ్నాప్– హత్యకు కుట్ర

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- బాలిక తల్లి మరోవ్యక్తితో చనువుగా ఉండటంతో కక్ష పెంచుకొని పథకం పన్నిన రెండో భర్త



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**కామారెడ్డి క్రైమ్:** పట్టణంలో మంగళవారం ఓ బాలిక కిడ్నాప్‌నకు గురికాగా, పోలీసులు 12 గంటల్లోగా కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. అశోక్ నగర్ కాలనీలో చిత్తు కాగితాలు ఏరుకునే మమత అనే వివాహిత మహిళకు రెండున్నర ఏళ్ల కుమార్తె కీర్తిక ఉంది. ఆమె తన భర్త చనిపోగా కుమార్తెతో కలిసి ఫుట్‌పాత్‌పైనే జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమెకు అశోక్ నగర్ కాలనీలోని కల్లు దుకాణంలో పనిచేసే పిల్లి రాజుతో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితమే వారిద్దరూ ఆలయంలో పెళ్లి చేసుకుని కలిసి ఉంటున్నారు. కానీ మమత మరో వ్యక్తితో చనువుగా ఉండటంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీంతో వారు వేర్వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో మమత సోమవారం రాత్రి తన కుమార్తెతో కలిసి అశోక్ నగర్ కాలనీ ఫుట్‌పాత్‌పై నిద్రించింది. మంగళవారం ఉదయం ఆమె లేచి చూసేసరికి కుమార్తె కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు సాయంత్రం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వైన్స్ వద్ద చిన్నారితో ఉన్న రాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మద్యం సేవించిన అనంతరం పట్టణ శివారులోని చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి చిన్నారిని చంపేయాలని కిడ్నాప్ చేసినట్లు పేర్కొన్నాడు. మమతపై కక్ష పెంచుకున్న అతడు ఆమెను మనోవేదనకు గురి చేయాలని భావించి కీర్తికను చంపాలని పథకం వేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. చిన్నారిని తల్లి మమతకు అప్పగించారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం

**కామారెడ్డి క్రైం:** పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించగా పట్టణ పోలీసులు ఘటన స్థలానికి సకాలంలో వెళ్లి ఆమెను కాపాడారు. కాలనీకి చెందిన సదరు మహిళ తన కుమార్తె ప్రేమ వ్యవహారంలో మాట వినడం లేదని మనస్థాపానికి గురైంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఆమె రైలు పట్టాల పైకి వెళ్లగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మహిళను కాపాడారు. ఆమెకు ఎస్‌హెచ్‌వో నరహరి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### నాణ్యమైన సేవలు అందిస్తాం

**నిజామాబాద్ లీగల్:** పోస్టల్ డిపార్ట్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామని, దీనిద్వారా నాణ్యమైన సేవలను అందిస్తామని పోస్టల్ ఎస్ఎస్పీవో ఎస్ జనార్దన్‌రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోస్టాఫీస్‌లో మంగళవారం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎస్పీ సురేఖ, ఐపీపీజీ శ్రావణ్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ అజయ్ కుమార్, పోస్టుమాస్టర్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

# డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

**జక్రాన్‌పల్లి:** మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని బడా బీంగల్ గ్రామానికి చెందిన గోపిచంద్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. మంగళవారం ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎదుట అతడిని హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు.

**బోధన్ పట్టణంలో..**

**బోధన్‌టౌన్(బోధన్):** పట్టణ పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేయగా, నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన శుభర్, బోధన్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్, వెంకటేష్, వర్మగా గుర్తించి, కేసు నమోదు చేశారు. వారిని పోలీసులు మంగళవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

**సిరికొండ మండలంలో..**

**సిరికొండ:** మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

**పోలీసుల సమయాన్ని వృథా చేసిన వారికి..**

పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీకి చెందిన షేక్ అయూబ్, మూల వినోద్ ఇటీవల మద్యం మత్తులో డయల్ 100కి ఫోన్ చేసి, పోలీసుల సమయాన్ని వృథాచేశారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, మంగళవారం బోధన్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారికి ఒక రోజు జైలు శిక్ష విధించారని సీఐ వెల్లడించారు.

**నందిపేట మండలంలో..**

**నందిపేట్ (ఆర్మూర్):** మండలంలోని చౌడమ్మ కొండూరు గ్రామానికి చెందిన బంగారు రాజు అనే వ్యక్తి తరచు డయల్ 100కు కాల్ చేస్తూ దుర్వినియోగం చేశాడు. దీంతో అతడిపై నందిపేట పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి ఐదు రోజుల శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

### న్యూసెన్స్ కేసులో..

**ఖలీల్‌వాడి:** నగరంలోని మూడో టౌన్ పరిధిలో మద్యం తాగి న్యూసెన్స్ చేసిన ఒకరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా.. సోమవారం అర్ధరాత్రి న్యూసెన్స్ చేస్తున్నట్లు ఓ వ్యక్తి నుంచి మూడో టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు డయల్ 100 ద్వారా కాల్ వచ్చింది. వెంటనే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, న్యూసెన్స్ చేసిన కుర్రె దినేష్, బొట్టు సాయిలను మందలించారు. కానీ కుర్రె దినేష్ పోలీసులతో అసభ్యకరంగా ప్రవర్తించి, వారి విధులకు అంతరాయం కలిగించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈమేరకు పోలీసులు అతడిని జైలుకు తరలించారు.

### ఏఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్ల అటాచ్

**ఖలీల్‌వాడి:** ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లోని ఇద్దరె కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈనెల 17న వేల్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కనువిప్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంలో శాంతిభద్రతలో భాగంగా పోలీసులు పలువురు కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి ఆర్మూర్ పీఎస్‌కు తరలించారు. ఈ ఘటనపై కొందరు నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఒక వీడియో రికార్డ్ చేసి విడుదల చేశారు. పోలీస్ స్టేషన్‌లో వీడియో రికార్డ్ చేసినందుకు వారి మీద చట్టరీత్యా పోలీసులు యాక్షన్ తీసుకుంటున్నారు. ఆ స్థలంలో పోలీసుల టోపీలు ఉండడాన్ని గమనించి, విధులలో ఉన్న పోలీస్ సిబ్బందిపై క్రమశిక్షణలో భాగంగా హెడ్ కానిస్టేబుల్ ముత్యంరావు, కానిస్టేబుల్ సతీష్‌లను ఏఆర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు.

### ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**బోధన్‌టౌన్(బోధన్):** విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్, డ్రగ్స్, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని, ర్యాగింగ్ పెనుభూతమన్నారు. 18ఏళ్లు నిండిన వారే వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.